# పసికందుల మార్కెట్

సూరమ్మను చూడగానే డాక్టరు వినత "ఏం జబ్బు?" అని అడిగింది.

"డోకులెళ్ళుతున్నాయి డాక్టరమ్మా?"

"ఎప్పటినుంచి?"

"పదిరోజులపైనే అయింది. కడుపులో తిప్పినట్లయితది. అంట్లు తోముదామని కూచుంటే కళ్లు మూసుకుపోయి నిద్రొస్తది. పాచిపనులు చెయ్యలేకపోతున్నాను."

"లోపలికిరా చూస్తా" పరీక్షచేసి చూసింది.

"నీకు పెళ్ళయిందా ?"

"ఇంకా మనువు కుదరలేదు"

"పాచిపనులు ఎక్కడ చేస్తున్నావు?"

"ఆ చివరిసందులో చదువుకునే పిల్లలకు వండిపెడత. బట్టలుతికి గది ఊడుస్త. మా యింటికాడనే ఒక యింట్లో పనంత చేస్త. ఈరెండే, ఇంకెక్కడ చెయ్యను."

"చదువుకునే పిల్లలదగ్గర ఎంతకాలంనుంచీ చేస్తున్నావు?"

"కాలేజి తెరిచినకాడనుంచి నలుగురికీ వండిపెడతనమ్మా."

"నీకిప్పుడు మూడోనెల పెళ్ళి కాలేదంటున్నావు. వాంతులకు మందిస్తాను తీసుకెళ్ళు. అప్పుడప్పుడు వచ్చి చూపించుకుంటూ ఉండాలి. మీ ఇంట్లో ఎవరికైనా తెలుసా ఈ సంగతి ?"

"మా నాయన గుడ్డోడు. ఒక్కడే ఉండడు. ఆడికెట్ల తెలుస్తది డాక్టరమ్మా ?"

''ఇంక చుట్టుపక్కల ఎవరూ లేరా?''

''ఉన్నారు. ఈ మాట చెబితే ఏమంటరో గద?''

''ఒకపని చెయ్యి. నీకు ఈనెల జీతమిచ్చారా వాళ్లు?"

"మొన్ననే తీసుకున్న. ఇప్పుడు కాలేజికి పోతలేరు. ఎవరినో కొట్టినరట. ఆడినుంచి కాలేజి బందుజేసినరట. ఇంట్లనే ఉంటరు.

''ఆ యిల్లు మానెయ్యి. ఇంకోయిల్లు కూడా మానుకో. నా అస్పత్రిలో పనిచెయ్యి. ఒక మనిషి వెళ్ళిపోయింది."

''మా నాయనకు అన్నంపెట్టాలి గదమ్మా?''

''వండిపెట్టు. తినిపించు. పొద్దున ఎనిమిది గంటలకు రా. మధ్యాహ్నం ఒంటిగంటకు వెళ్లు. మూడుగంటలకు మళ్ళీ రా. రాత్రి ఏడుగంటలయిన తరువాత వెళ్లు నూటపాతిక జీతమిస్తా. చిన్నచిన్న పనులే గాని, చెప్పినట్టు శుభ్రంగ చెయ్యాలి.''

''ఆళ్ళకేమని చెప్పాలి డాక్టరమ్మా? ఎందుకు రావని అడుగుతరు కద?''

''మళ్ళీ అటు వెళ్ళకు, ఇంక ఆరునెలలకు పురుడు వస్తుంది. ఎవరూ లేరంటున్నావు. అప్పుడెక్కడికి పోతావు? వాళ్ళకసలు కనబడకు. వాళ్లలో ఎవరో నిన్నిట్లా చేశాడు? మరి వాడు పెళ్ళిచేసుకుంటాడా? చదువుకునేవాడు చేసుకోడు. నీకు పెళ్ళెట్లా అవుతుంది? ఇంక మీ చుట్టుపక్కలవాళ్ళంతా నీవెంట బడతారు. ఈ కడుపుసంగతి తెలిస్తే నీకెవరూ సహాయం చెయ్యరు. ఎవరూ చెయ్యక పోయినా ఇక్కడ నేను చేస్తా. ఇంకా ఇద్దరు ఆడమనుషులున్నారు. ఒక నర్సు ఉన్నది. పురుడు కూడా ఇక్కడే అవుతుంది."

''సూరమ్మకు పదిహేడు-పద్దెనిదేళ్ళకంటె ఎక్కువ లేవు. తల్లిగాని పెద్దవాళ్ళుగాని లేరు. మంచిచెడ్డలు తెలియవు. విద్యార్థులు డబ్బిస్తారుకదా అని పనికి కుదిరింది వాళ్లు నవ్విస్తూ, ఎగతాళిచేస్తూ పనిచేయించుకున్నారు. సూరమ్మ కూడా సరదాగానే ఉంది. అక్కడ పనిచెయ్యటం బజార్లో తెచ్చుకున్న మిఠాయిలూ పళ్ళు ఇచ్చేవాళ్ళు. నవ్వుకుంటూ, ఎగురుకుంటూ పనిచేస్తుంటే చేసినట్టే ఉండేది

కాదు. మరి- డాక్టరమ్మ పనిమానుకోమంటుంది?" ఏంచేస్తే? దానికి ముందువచ్చే కష్టనష్టాలు తెలియక ఆలోచనలో పడ్డది.

"చూడు సూరమ్మా. రేపు పొద్దున ఎనిమిది గంటలకు రా. మందిస్తా"నని ఇంకొక మనిషిని పిలిచింది పరీక్ష చెయ్యటానికి డాక్టరు.

ఆ సాయంత్రము ఆరుగంటలకు ఆ విద్యార్థులకు వండిపెట్టింది తన ఇంటి దగ్గర ఉన్న కొలువు పూర్తిగా చేసింది. ఇంటికివెళ్ళి అన్నం తండ్రికిపెట్టి తను తిన్నది. ఆ రాత్రి కలవరపాటు లేకుండా హాయిగా చింకిచాపమీద బొంత వేసు కుని పడుకుని నిద్రపోయింది.

తెల్లవారి లేస్తూనే రెండు వాంతులయ్యాయి.

"ఏటయింది సూరీ అట్ల డోకుతున్నావు?" తండ్రి అడిగాడు.

"కడుపునొప్పి. నీ కన్నం ఒండిపెట్టి డాక్టరమ్మదగ్గరికి పోత. ఈ ఏళ పాచిపనికి పోను" అంటూ తండ్రి కన్నంపెట్టి తిరిగి వాంతిచేసుకుంది. కొంత సేపటికి లేచి డాక్టరుదగ్గరికి బయలుదేరింది.

డాక్టరుదగ్గర ఇద్దరు ఆడనౌకర్లున్నారు. వాళ్ళు ఆస్పత్రి అంతా ఊడ్చి కడిగిపెట్టారు. నర్సు చేతికింద పనులు చేశారు. డాక్టరు వచ్చేసరికి అన్నీ సిద్ధం చేసి పెట్టింది నర్సు.

డాక్టరు రాగానే ఒక ఆడనౌకర్ని పిలిచి సూరమ్మ సంగతులన్నీ కనుక్కో- మన్నది. తను వచ్చిన రోగులను ఒక్కొక్కర్నే చూస్తున్నది.

డాక్టరుదగ్గర పనిచేస్తున్న మంగమ్మ సూరమ్మను అవతలికి తీసుకుపోయి ఆమె ఇంటివిషయాలన్నీ అడిగింది. సూరమ్మకు ముందు ముందు రాబోయే సమ స్యలను గురించి వివరంగా చెప్పింది.

"మీ ఊరికిపోతే ఎవడయిన తెలియనివాడు చేసుకుంటాడేమో. కాని మీ వాళ్ళెవరూ లేరంటున్నావు కదా?"

వివరాలు తెలుసుకున్న తర్వాత సూరమ్మకు పట్టరాని దుఃఖం వచ్చింది. కాన్పుకోసం తానిక్కడుండిపోతే తన తండ్రిని ఎవరు చూస్తారు? తిండి ఎవరు

పెడతారు? కళ్ళులేని గుడ్డివాడి గతి?' వెక్కివెక్కి ఏడ్చింది. భవిష్యత్తు అయోమయంగా కనబడి భయపెట్టింది,

''చూడు సూరమ్మా, నేను చెప్పేదేమిటో విను. ఈ ఊళ్ళో కుంటివాళ్ళనూ గుడ్డివాళ్ళనూ ఉంచుకుని అన్నంపెట్టే ఆశ్రమముంది. అక్కడ బాగా పనిచెయ్య గలిగిన వాళ్ళచేత పనిచేయిస్తారు. పంటలు పండిస్తారు. కూరగాయలు పండిస్తారు. ఎవరూ లేని పేదవాళ్ళను మాత్రమే ఉంచుకుంటారు. డాక్టరమ్మ చీటీరాసిస్తే నీ తండ్రిని అక్కడ ఉంచవచ్చు. నీవెప్పుడయినా పోయి చూసిరావచ్చు. నీవు ఎవరి భయం లేకుండా ఇక్కడే ఉండి పనిచెయ్యి. పురుడు పోస్తుంది డాక్టరమ్మ. ఆస్పత్రి వెనకాల ఒక గది నీకిస్తుంది. మేము అక్కడే ఉంటున్నాము. మాపిల్లలు బడిలో చదువుతున్నారు. నీవు పని బాగా నేర్చుకుంటే జీతమెక్కువ చేస్తుంది. ఇక్కడ శుభ్రంగా ఉండాలి. మంచిబట్టలేసుకుని పనిలోకి రావాలి తల దువ్వుకుని ఉండాలి. లోపల పనిచేసేటప్పుడు తలకు బట్టకట్టుకోవాలి వెంట్రుకలు రాల కుండా. ఇక్కడ ఉంటే నీకంతా బాగుంటుందని డాక్టరమ్మ చెప్పమన్నది. ఆలోచించుకో'' చెట్టుకింద కూర్చోబెట్టుకుని భుజమ్మీద చెయ్యివేస్తూ చెప్పింది మంగమ్మ.

ఏడ్చిఏడ్చి సూరమ్మ ముఖమంతా ఎర్రబడ్డది.

మధ్యాహ్నం మంగదగ్గర భోజనంచేసింది.

సాయంత్రానికల్లా మనసు నెమ్మది చేసుకుని డాక్టరు చెప్పినట్టు చేస్తానని ఒప్పుకున్నది.

ఆ మరునాడే తండ్రిని ఆశ్రమంలో దగ్గరుండి చేర్పించింది. అప్పుడప్పుడు వచ్చి చూస్తానన్నది తాను డాక్టరమ్మదగ్గర ఉండిపోయింది.

డాక్టరిచ్చిన ఎడ్వాన్సు జీతంతో రెండు మంచి చీరెలు. జాకెట్లు కొనుక్కున్నది. మంగమ్మ గుండమ్మల మాదిరిగా శుచిగా శుభ్రంగా బట్టలుకట్టుకుని పని చేయటం మొదలుపెట్టింది

ఇప్పుడెవరయినా ఆమెను చూసి పాచిపనిచేసి బతుకుతున్న సూరమ్మను కోరు. మనిషి చురుకుబారింది ఎంతో అనుభవం ఉన్నదానిలా డాక్టరు చేతికింద మెలగుతోంది. అప్పుడప్పుడు తండ్రి అప్పన్నను చూసివస్తోంది.

నెలలు నిండుతున్నాయి. కడుపులోఉన్న పాప చేతులూ, కాళ్ళూ కదిలిస్తూ బయటికి వస్తానంటున్నది.

గర్భిణీస్త్రీలా సూరి భారంగా నడవటంగాని, కూర్చున్నచోటనుంచి లేవలేక పోవటంగాని లేదు. సూరిపట్ల చాలా ప్రేమతో ఆదరంగా దగ్గరికి పిలిచి, ఆరోగ్యం సంగతడిగి, మంచి మందులిస్తున్నది డాక్టరు. తనకు పేషెంట్లు ఇచ్చిపోయిన పళ్ళు ఇస్తున్నది. మంచి పోషకాహారానికి కావలసిన వస్తుసామగ్రిని తెప్పించి ఇస్తున్నది.

చిన్నతనమైనప్పటికీ సూరికి నెలలు నిండుతున్నకొద్దీ తనకోపాప పుట్టబో తున్నదనీ, ఆ పాపకు తనకున్నదానిలో అపురూపంగా చూసుకోవాలనీ కలలు కంటూ మనసులో ఉవ్విళ్ళూరుతున్నది. ఎప్పుడైనా తనను తల్లిని చేసినవాడిని తలుచుకుంటుంది. మాయకబుర్లు చెప్పి, స్నేహితులు పడుకున్నతరువాత సినె మాలకు తీసుకెళ్లేవాడు. షాపులకు తీసుకెళ్ళి పూలు, పళ్ళు కొనిపెట్టి ఆమెను మురి పించేవాడు. వాడి కబుర్లకు తను లొంగిపోయింది. అయినా అతడు కళ్ళల్లో మెదులుతున్నాడు. అందమైన క్రాపు, గుండ్రటి ముఖం, పెద్ద కళ్ళు మళ్ళీమళ్ళీ చూస్తే బాగుండుననిపించేది. అతడు నవ్వితే మళ్ళీమళ్ళీ చూడాలనిపించేది. తప్పు దారి పట్టించినా అతడినే తలుచుకునేది.

ఒక రాత్రివేళ తొమ్మిదిగంటల తరువాత బెల్ రింగయింది. డాక్టరు వినత ఆమె భర్త పద్మనాభం మేడమీదినుంచి దిగివచ్చారు. తలుపుతీయగానే మార్వాడీ సేట్ అర్జున్‌లాల్ అతడి భార్య లోపలికి వచ్చారు.

"మా ఆశలన్నీ మీమీదనే ఉన్నాయి డాక్టర్. ఈసారయినా మీరిచ్చిన మాట నిలబెట్టుకోండి" అంటున్నాడు అర్జున్‌లాల్.

"సేట్‌సాబ్. మీరు కోరినట్టుగా తప్పకుండా సహాయం చేస్తాము. కాలం కలిసిరాలేదు కిందటిసారి. ఈసారి మీ కోరిక తప్పక తీరుతుంది. ఆడపిల్లయినా మగపిల్లవాడయినాసరే మీకు అందించటం ఖాయం. ఏదిలభిస్తే అది మీకందిస్తాం" ఇద్దరూ వాళ్ళకు మరొకసారి వాగ్దానం చేశారు.

"మగపిల్లవాడయితేనే బాగుంటుంది. మా వంశాభివృద్ధి జరుగుతుంది" అన్నాడు సేట్ మళ్ళీ.

"సేట్ సాబ్. అది మనచేతిలో లేదు. ఇచ్చిన ఫలాన్నందుకోండి. ఏ ఫల మందితే అదే ఇస్తాము. మీరు ఎదురుచూస్తూ ఉండండి. నేను ఫోన్‌చేస్తాను'' అన్నారు డాక్టర్ పద్మనాభం. సేట్ దంపతులను సాగనంపి పైకి వెళ్ళారు.

ఆరోజు ఆదివారం. డాక్టర్లిద్దరూ మాటినీషోకు వెళుతూ మంగమ్మను పిలిచి ''సూరికి ఏమాత్రం నొప్పులు వచ్చినా మాకు ఫోనుచెయ్యి. ఇదిగోనెంబరు. సూరి కిది మొదటికాన్పు. కాస్త దగ్గరుండి ఓదార్చు" అని మరీమరీ చెప్పివెళ్ళారు.

ఆ ఉదయంనుంచీ సూరి బద్ధకంగా ఉందనోసారి, నడుమునొప్పి అని ఓసారి అంటూ మంగమ్మను అంటిపెట్టుకునే ఉంది. సరిగా కూర్చోలేకపోతోంది. అన్నంకూడా సరిగా తినలేదు. ముఖమంతా వాడిపోయింది. అప్పుడప్పుడు కన్నీరు కారుస్తున్నది.

"భయపడతావెందుకు నేనున్నానుగా?'' అని మంగమ్మ ఆమెకు ధైర్యం చెబుతోంది.

ఆస్పత్రినానుకునే డాక్టరు ఇల్లు ఉన్నది. నివాసం పైన పెట్టుకుని కింద ఆపరేషన్లు, పురుళ్ళకు తగిన ఏర్పాట్లున్నాయి. పురుడయిన మూడోనాడు ఇంటికి పంపిస్తారు రెండుఇళ్ళనూ కలపటానికి ఒక తలుపుమాత్రమే అడ్డం. ఇటువంటి సందర్భాలలో ప్రభుత్వాసుపత్రి నుంచి థియేటర్ నర్సుకు టెలిఫోను అందగానే వస్తుంది.

డాక్టరు వినత ఇంటికిరాగానే ముందుగా సూరిని చూసింది. వేడివేడి కాఫీ ఇప్పించింది.

"ఎట్లాఉంది నీకు? బాధగా ఉందా ? నీకేం భయంలేదు. నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డువేస్తాను. మేము భోజనాలయినతర్వాత మళ్ళీ వస్తాము" అంటూ సూరి బుగ్గలు నిమరి వెళ్ళింది.

రాత్రి పన్నెండుగంటలకు అయోమయంగా విపరీతమైన బాధపడుతున్న సూరిని ఆపరేషన్ థియేటర్‌కి తీసుకువెళ్ళారు. థియేటరు నర్సుకు టెలిఫోను వెళ్ళింది. ఆమె రాగానే థియేటర్‌ని సిద్ధంచేసింది. మూడుగంటలకు సూరికి సిజేరేయన్ అయింది. బిడ్డను బయటికి తియ్యగానే డాక్టరు వినత బిడ్డను పక్క

గదిలోకి తీసుకువెళ్ళింది. అక్కడే బొడ్డుకోసి, శరీరం శుభ్రంచేసి ఉయ్యాలలో పడుకోబెట్టింది.

థియేటర్లో-సూరికి డాక్టరు కుట్లువేసి ఇంజక్షను ఇచ్చింది. పని పూర్తిచేసుకుని థియేటరు నర్సు వెళ్ళిపోయింది.

సూరి ఇంకా ఆపరేషన్ టేబుల్‌మీదనే ఉంది. ఇంకా బాగా స్పృహ రాలేదు.

డాక్టర్ పద్మనాభం తన మేడమీద గదిలోనుంచి సేట్‌జీకి ఫోన్‌చేశాడు.

సేట్ అదిరిపడి లేచి సంతోషంతో భార్యను లేపి కారులో వచ్చాడు. పద్మనాభం వాళ్ళను ఉయ్యాలదగ్గరికి తీసుకెళ్ళి పిల్లవాడిని చూపిస్తూ "ఇడుగో మీరెంత కాలంనుంచో ఎదురుచూసిన మగబిడ్డ. చాలా చక్కగా ఉన్నాడు. ఏడుపౌండ్ల బరువు. తెల్లటి రంగు. నల్లటి ఉంగరాల జుట్టు. ఇరవై వేలయినా ఇవ్వాలి" అన్నాడు.

"డాక్టర్, అంతధర పెట్టకండి. నేనిదివరలో ఇచ్చిన పదివేలతో తృప్తి పడండి" అన్నాడు వ్యాపారబుద్ధితో.

"ఇవాళే ఇంకొక ఆయన వచ్చాడు. జమీందారు, ముప్పయి అయినా ఇస్తానన్నాడు."

బేరం కచ్చితంగా జరుగుతోంది.

సేటు పిల్లవాడిని వదులుకోలేక మిగతాపైకం చెల్లించి, పక్కగా ఆపుకున్న కారులో, పాత్రిళ్ళలో చుట్టబెట్టి శాలువ కప్పిన పసికందుతో వెళ్ళిపోయాడు.

వెంటనే డాక్టర్లిద్దరూ తలుపులు భద్రంగావేసి థియేటరులోకి వచ్చారు. సూరీ...సూరి. అంటూ పిలిచారు. ఆమె ఊఁ...ఊఁ అంటూ మూలుగుతున్నది కాని కళ్ళు తెరవలేదు

డాక్టర్లు ఆమెనాడి చూసి తృప్తికరంగా ఉందని కుర్చీలు వేసుకుని కూర్చున్నారు.

ఒక అరగంటలో సూరి మూలుగుతూ కళ్ళుతెరిచి ఇటూ-అటూ చూసింది. ఆమె కళ్ళకు డాక్టర్లిద్దరూ కనిపించారు.

"కడుపునొప్పి డాక్టరమ్మా. అబ్బా అబ్బా అంటూ మూలిగింది. ఆమె కళ్ళు దేనికోసమో వెతుకుతున్నాయి.

అంతలో డాక్టర్ పద్మనాభం లేచి ఒక పెద్ద మూతిగల సీసా తీసుకొచ్చి నీకు కాన్పు సరిగా కాలేదు. ఆపరేషన్ చేయవలసి వచ్చింది. ఇవిగో—వీటిని ద్రాక్షగుత్తులంటారు. అవి చుట్టలుచుట్టుకుని అల్లుకుపోయాయి. ఆపరేషన్ చేసి వీటిని తీసి, లోపల అంతా శుభ్రంచేసి కుట్లువేశాము. నీకు చూపించాలని ఈ సీసాలో వేసి పెట్టాము" అంటూ ఆమెకు వాటిని ఫార్సెప్సుతో తీసి చూపించాడు.

''అయ్యో,'' అంటూ వాటిని చూసి కన్నీరు కార్చింది సూరి.

వెంటనే వినత లేచి "సూరీ. ఆపరేషన్ చేసేవరకూ తెలియలేదు. నీకు బిడ్డను అందించాలని ఎంతో సంబరపడ్డాం. కాని మాక్కూడా ఆశాభంగమైంది. తొమ్మిదినెలలు మోశావు బిడ్డనెత్తుకుందామని. చివరకు ఇలా జరిగింది. బాధ పడకు. నీది చిన్న వయసు. ఇంకా జీవితమంతా ముందున్నది, ఏడవకు'' అని దగ్గరగా నిలబడి కళ్ళుతుడిచి ఓదార్చింది. ఆమెను స్ట్రెచర్‌మీద ఆస్పత్రిలో ఒక మంచమ్మీదికి చేర్పించింది.

నర్సూ, ఆడనౌకర్లూ సూరిని ఓదార్చారు. వేడి కాఫీ ఇచ్చారు. నొప్పి తగ్గ టానికి డాక్టర్ పంపించిన మాత్ర వేశారు. ఐదునిమిషాలలో సూరి నిద్రపోయింది.

ఉదయం ఎనిమిదిగంటలకు డాక్టర్లిద్దరూ సూరి మంచందగ్గరికి వచ్చి కూర్చున్నారు వాళ్ళను చూడగానే సూరి మళ్ళీ ఏడ్చింది.

"ఏడవకు. ఇంకా నీకు నొప్పులు వచ్చాయికనుక ఆపరేషను చేశాము. కొందరికి నొప్పులు రావు. కాని రోజులు గడుస్తూఉంటాయి. ఈలోపల గర్భసంచీ రోగగ్రస్తమవుతుంది. మళ్ళీ కాన్పు రాకుండా గర్భసంచీ తీసివేయవలసివస్తుంది. నీ అదృష్టం బాగుందనుకో, పిల్లలకేమిటి? మళ్ళీ ఏడాదికి బిడ్డనెత్తుకోవచ్చు" ఆమెకు సర్ది చెప్పాడు.

సూరిని అందరూ వచ్చి పలకరించి పోతున్నారు. మరునాడు కూర్చో బెట్టారు. క్రమంగా పట్టుకుని నడిపించారు. అందరినీ తొమ్మిదిరోజులకు ఇంటికి పంపించినా సూరిని పదిరోజులు ఆ మంచమ్మీదనే ఉంచారు. మంగమ్మ అన్నం వండి పట్టుకువచ్చేది. ఆస్పత్రిలో పాలు ఇచ్చేవారు.

సూరి ఆ తర్వాత రెండునెలల సెలవుమీద ఆ గదిలోనే ఉంటూ ఎప్పుడైనా తోటలోకి వచ్చేది. డాక్టర్ వినత ఆమెకు సగంజీతం కాకుండా పూర్తిజీతం ఇచ్చేది, త్వరగా కోలుకోవాలని మందులు ఇచ్చేది. గుడ్లు, పళ్ళూ తినమని పంపించేది.

సూగికి కడుపులో ఏదో బాధగా ఉండేది. దిగులుగా ముఖం పెట్టేది. అప్పుడప్పుడు పట్టలేక ఏడ్చేది. డాక్టర్ మందలిస్తూ ఉండేది.

కొంచెం బలం పుంజుకున్న తర్వాత ఒకనాడు సూరి తండ్రిని చూడటానికి వెళ్ళింది.

"ఇన్నాళ్ళెందుకు రాలేదు ?" అడిగాడు అప్పన్న.

"చాలా జబ్బుచేసింది నాయన, కడుపుకు ఆపరేషను చేశారు. నేను కొలువున్న డాక్టరమ్మే మంచిబెడ్డలు చూసింది" అంటూ తండ్రికి రెండు పళ్ళు చేతికిచ్చింది.

''నీకిక్కడ ఎట్లున్నది ? మంచిగ అన్నం పెడుతున్నారా?" అడిగింది.

"మంచిగున్నది. ఎప్పుడైనా పెద్దలు మిఠాయిలు తెచ్చిఇస్తరు. అందరికీ పంచిపెడతరు. బాగానే ఉన్న. నీవు రాకపోతివని బాధపడ్డ."

"నేను జబ్బుపడ్డనని చెప్పినగద? కొంచెం బాగయినాక వచ్చిన. ఇంక వస్తలే పదిరోజులకొకసారి" గంటసేపు కూర్చుని తిరిగి వచ్చింది. మెల్లగా ఆస్పత్రి పనులు చేయటం కూడా మొదలుపెట్టింది.

ఒకనాడు సూరి తండ్రిని చూసి వస్తుండగా చదువుకునే విద్యార్థులలో సూరితో చనువుగా ఉండే కోదండం కనబడ్డాడు.

అంత దూరంనుంచే గుర్తుపట్టి "ఇంతకాలం ఎక్కడున్నావు? నీవు ఎందుకు వెళ్ళిపోయావు? చెప్పకుండా అట్లా వెళ్ళిపోతావా? నేను నీకేం తక్కువ చేశాను? సినిమాలు చూపించలేదా? పూలు కొనిపెట్టలేదా? ఊళ్ళోనే ఉన్నావా? సంభ్రమంతో ఆమెను నిలబెట్టి మనిషిని కుదుపుతూ ప్రశ్నలువేయటం మొదలుపెట్టాడు కోదండం.

సూరి తనకు జబ్బుచేసినట్టూ, తండ్రిని ఆశ్రమంలో చేర్పించినట్టూ అంతా

వివరంగా చెప్పి తను ఆస్పత్రిలో పనిచేస్తున్నట్టు చెప్పింది. అతడు ఆమెను విడిచిపెట్టలేదు. అక్కడినుంచి హోటలుకు తీసుకువెళ్ళాడు. తరువాత సినెమాకు తీసుకెళ్ళాడు. గదిలో తనొక్కడే ఉంటున్నట్టు ఒక గది చూపించాడు.

పొద్దుపోయిందనుకుంటూ సూరి తన గదికి చేరుకున్నది. ఇలా తండ్రిని చూడటానికి వెళ్ళినప్పుడల్లా కోదండాన్ని చూసివచ్చేది.

ఆపరేషను అయినతర్వాత ఆరునెలలకు సూరికి మళ్ళీ కడుపులో వికారం మొదలైంది. వాంతులు. ఏమి తిన్నప్పటికీ కడుపులో ఇమడటంలేదు.

వినత ఆమెకు మందులూ, టానిక్కులూ, పళ్ళరసాలూ ఇవ్వటం మొదలు పెట్టింది. నెలరోజులకు కాస్త కోలుకుంది.

సూరిపట్ల డాక్టర్ ఇంత విపరీతంగా శ్రద్ధకనపరచటం గుండమ్మకు అసాధారణంగా కనుపించింది. ఇంత శ్రద్ధ డబ్బుతీసుకుని మందులిచ్చే రోగులపట్ల కనపరచనిది పనికోసం పెట్టుకున్న ఒక నౌకరుపట్ల చూపటమా అనుకునేది. డాక్టర్ వినతనూ, సూరినీ పరిశీలిస్తూ ఉండేది.

"మంగమ్మా! గుండమ్మా! సూరిని బరువుపనులుచెయ్యనివ్వకండి. కొంచెం జాగ్రత్తగా చూడండి" అనేది రోజుకొకసారి డాక్టర్ వినత.

"ఎందుకమ్మా? ఆమెలాటివారం మేము కామా?" అనేది గుండమ్మ.

"అవుననుకో. నిరుడేకదా పెద్దఆపరేషను అయింది? అది ముత్యాలగర్భం చాల నీరసపడిపోయింది. ఈసారి ఎట్లాఉంటుందోనన్న భయంతో చెప్పాను. తోటి మనిషి కదా? నీవిట్లా అనటం ఏమీ బాగాలేదు" అంటూ వెళ్ళిపోయింది డాక్టర్.

సూరిని తండ్రిని చూడటానికి కూడా పంపటంలేదు. నెలలు నిండ వచ్చాయి.

"ఈసారి కూడా సిజేరియన్ చెయ్యాల్సిందేగా?" అడిగింది వినత పద్మనాభాన్ని.

"బిడ్డ సైజునుబట్టి నిర్ణయం తీసుకోవాలి. బిడ్డసైజు చిన్నదిగా కనబడుతున్నది సహజంగా కాన్పు కావచ్చు."

"జమీందారు ఒప్పుకుంటాడా చిన్న సైజులో బిడ్డ ఉంటే?"

"ఒప్పుకోక? నేను మాట యిచ్చాను. అతడు ఎడ్వాన్సు ఇచ్చాడు. ఇదంతా మగబిడ్డయితేనే సుమా."

సూరి బద్ధకంగా ఉన్నట్టుగా ఉంటోంది.

వినత, పద్మనాభంల లెక్కప్రకారం సూరికి పురుడు రావలసిన టైము పదిరోజుల తర్వాత.

కాని- సూరికి ఒక తెల్లవారుఝామున నొప్పులొచ్చాయి. కాన్పులగదిలోనే చిన్నసైజు మగబిడ్డను కన్నది, వినత వెంటనే బిడ్డను బొడ్డుకోసే నెపంతో అవతల ఇంట్లోకి తీసుకువెళ్ళి పద్మనాభానికి అందచేసింది, తిరిగివచ్చి బాలెంతకు అవసరమైన ఇంజక్షను ఇచ్చింది. పావుగంట తర్వాత నర్సువచ్చింది. మరికొంత సేపటికి ఆమెను గదిలో మంచమ్మీద చేర్చింది.

సూరి ఎదురుచూస్తోంది. బిడ్డను తీసుకువచ్చి ఉయ్యాలలో పడుకోబెడుతుంది నర్సని.

బిడ్డ పుట్టగానే ఏడ్చిన ఏడ్పు తన చెవులతో విన్నది.

ఎంత మధురంగా విన్పించింది తనకు?

ఏడ్చిన బిడ్డను హృదయానికి హత్తుకోవాలని మనసు తొందరపెడుతున్నది.

ఎవరి పోలికో ?

అచ్చు కోదండరామ్‌లా ఉంటాడేమో? అలా ఉంటేనే తనకిష్టం! తెల్లటి ముఖమ్మీద దోబూచులాడే నల్లటి ఉంగరాలజుట్టుంటే తనకి ప్రాణం లేచివస్తుంది. అయినా తన బిడ్డ. తన రక్తం పంచుకుని పుట్టిన బిడ్డ. ఎట్లాఉన్నా తన కంటికి సౌందర్యంగానే ఉంటుంది.

ఏదీ, ఇంతసేపయింది? ఒక్కరూ తీసుకురారేం?

కళ్ళు మూసుకుపోతున్నా బలవంతంగా తెరిచిపెట్టుకొని చూస్తోంది సూరి.

ఒక గంట తర్వాత చిన్నికప్పుతో కాఫీ. దానితో ఒక మాత్ర తీసుకు వచ్చింది మంగమ్మ.

"మంగమ్మా! పాపను చూడాలనిఉంది చూసిన తర్వాత తాగుతా. పాపను ఎక్కడుంచారు? చెప్పవా?"

"డాక్టరమ్మ తీసుకొస్తుంది. ముందు నీవీ మాత్ర వేసుకో కాఫీ తాగుదువు గాని."

బలవంతంగా సూరి మాత్రవేసుకుని కాఫీ తాగింది.

పావుగంటయిన తర్వాత డాక్టరు వినత మెల్లగా అడుగులు వేసుకుంటూ వచ్చింది. ఆమె వెనక పెద్ద సీసాతో పద్మనాభం వచ్చాడు.

"నా పాపను చూపించరా అమ్మా?"

"నీ పాపను చూపించటానికే వచ్చాము. ఇదిగో నీ పాప. నీకు చూపించాలనే సీసాలో పెట్టి తెస్తున్నాము. పుట్టినతరువాత ఒక్కసారి ఏడ్చాడు. అంతే మళ్ళీ ఏడవలేదు. తల ఎంత పెద్దదిగా ఉందో చూడు. చేతులూ, కాళ్లూ, కడుపూ ఎంత సన్నగా ఉన్నాయో చూశావా? ఒక వింతశిశువును కన్నావు. పదినిమిషాలయినా కాకముందే చేతులూ, కాళ్ళూ కొట్టుకున్నాడు. అంతే. నీకిస్తే నీవు భయపడతావని నేను ఊరుకున్నాను. మంగమ్మ చెప్పింది- నీవు పాపను చూడనిదే కాఫీ తాగనన్నావని. అందుకని సీసాలో పెట్టి తెచ్చాను, చేత్తో ముట్టుకుంటే కాళ్ళూ చేతులూ ఊడివచ్చేలా ఉన్నాయి." అన్నాడు డాక్టరు.

"అయ్యో. ఈసారి కూడా ఇంతేనా? ఆ సీసా నాకియ్యండి. అట్లనే చూసుకుంటూ బతుకుతా" అంటూ లేవబోయి కిందపడ్డది. ఆమె కడుపు మసిలిపోతున్నది. ఆవేశంతో "నాపాప నాపాప" అంటూ కేకలు పెడుతున్నది.

మంగమ్మ, వినత ఆమెను ఎత్తి మంచమ్మీద పడుకోబెట్టారు. పద్మనాభం సీసా తీసుకుని వెళ్ళిపోయాడు తన గదిలోకి.

ఇచ్చిన మాత్ర పనిచేసేవరకూ డాక్టరు వినత మంచందగ్గరే నిలబడ్డది. సూరి కళ్ళుమూసుకుపోయినా "నాపాప-నాపాప" అంటూ వెక్కుతూ నిద్రలోకి జారుకుంది.

ఆస్పత్రిలో ఉన్న రోగులంతా ఆ సీసాలోని పాపను చూశారు.

"ఇట్లాంటి పిల్లలు పుడతారా? మనిషిపిల్ల మాదిరిగా లేదు."

"అసలది పిల్లేనంటావా?"

"తల, ముక్కు, కళ్లు, కాళ్ళూ చేతులూ అన్నీ ఉన్నాయి కాని- దయ్యం పిల్లలా ఉంది."

"ఎక్కడా చూడలేదే?"

అందరూ తలా ఒకమాటా అన్నారు. కొందరు ముక్కుమీద వేలేసుకుంటే కొందరు "ఈ మాయదారి సంతానమేమిటి సూరికి" అని జాలిపడుతున్నారు.

సుమారు అయిదారు గంటలపాటు నిద్రలో ఉన్న సూరి లేచింది. నిద్ర పోయినా ఆమె ఆవేశంతో "ఆ సీసా నాకియ్యండి. నేను వెళ్ళిపోతా. నేనిక్కడ ఉండనంటే ఉండ" మళ్ళీ ఏడుపు మొదలుపెట్టింది. ఎంత చెప్పినా ఎవరు చెప్పినా ఆమె కడుపులో దుఃఖమాగటంలేదు.

ఆ అరుపులకు వినత లేచివచ్చింది. "సూరీ. నిన్నూ, నీ బిడ్డనూ కాపాడాలని ఎన్నో మందులిచ్చాను. నీకు మంచి పిల్లలు పుట్టాలని నిన్ను ఎంతో బాగా చూసుకున్నాము. మంచి ఆహారమిచ్చాము. మేము నీకు ఏలోపమూ చెయ్యలేదు. మంచిబిడ్డలు పుట్టటమన్నది అదృష్టంలో ఉంది. వంశంలో ఉంటే కూడా ఇటువంటి పిల్లలు పుడతారు. నీవు ఎవరికి కంటున్నావో ఈ పిల్లలను, అతడిలో ఏమయినా లోపముందా? ఆ వంశంలో ఉందా? వాడెవడోగాని వాడిని ఇంక వదలిపెట్టు. ఇప్పుడేడిస్తే ఏం లాభం? వెళ్తానంటున్నావు వెళ్లు. నీవు ఉంటే మా ఆస్పత్రికి కూడా ఎవరూ రారు. మాకు నష్టమేగాని లాభంలేదు. ఆ సీసాను గవర్నమెంటు ఆస్పత్రికి ఇచ్చెయ్యాలి. మనం ఉంచుకోకూడదు" అంటూ వెళ్ళిపోయింది.

డాక్టరు వెళ్ళినవైపే చూస్తూ వెక్కివెక్కి ఏడ్చింది సూరి. ఆ సాయంత్రం మంగమ్మ బలవంతమ్మీద పాలు రొట్టె తిన్నది. మగతగా కళ్లుమూసుకుంది. ఏడ్చి ఏడ్చి నాలుగురోజులయిన తరువాత తన గదిలోకి వెళ్ళింది.

మెలకువగా ఉన్నంతసేపూ కోదండం ఎంత చక్కనోడు అనుకుంటుంది. ఆడికిటువంటి బిడ్డలు పుడతారా అని ఏడుస్తుంది. అక్కడుండాలని లేదు. ఎక్కడికయినా వెళ్ళిపోవాలి. కాని- ఎక్కడికి ?

ఏడ్చిఏడ్చి పిచ్చిదానిలా అయిపోయింది. రెండునెలలయినా డాక్టరు వినత

ఆమెను వెళ్ళి చూడలేదు. చిన్ని ద్వారా ఆమె విషయాలను తెలుసుకుంటున్నది. సూరి కూడా ఆస్పత్రిలోకి వెళ్ళే ప్రయత్నం చెయ్యలేదు. ఒకనాడు మాత్రం తండ్రిని చూడటానికి బయలుదేరింది.

తండ్రికి వయసు దాటింది. కాని బాగానే ఉన్నాడు. ఎప్పటిలా ప్రశ్నించాడు- ఈమధ్య రాలేదేమని ?

"నాయన, నేనక్కడుండ ఇంక. నాకక్కడ బాగలేదు."

"ఏం? ఏటయింది? నిన్ను బాగ చూస్తున్నరన్నవు కద? పండ్లిస్తరంటివి. పాలుపోస్తరంటివి గద?"

"ఇచ్చినరనుకో. కాని ఇంక ఉండ"

"మరెక్కడుంటవే. మనకెవ్వరున్నరే మంచి సెడ్డలకు?"

సూరి మాట్లాడలేకపోయింది ఒక గంటయిన తరువాత బయలుదేరింది.

దారిలో కోదండం కలిశాడు. అతడికి చెప్పుకుని ఏడ్చింది.

అతడికి ఆమెమీద ప్రేమ, నమ్మకం ఉన్నాయి. అదుపులోపెట్టే పెద్దలెవరూ తనకు లేరు. ఆమెను తనకు ఉద్యోగం రాగానే పెళ్ళిచేసుకుందామనుకున్నాడు. తనవల్ల ఆమె జీవితం నాశనం కాకూడదని అతడి ఆశయం. ఆమాటే ఆమెకు చెప్పి నాలుగయిదు నెలలలో పరీక్షలయిపోగానే ఆ ఊరినుంచి వెళ్ళి ఎక్కడయినా ఉద్యోగం చూసుకుంటానన్నాడు. అంతవరకూ ట్యూషన్లు చెప్పి బ్రతుకుదామన్నాడు. అప్పుడు తప్పకుండా దేవాలయంలో పెళ్ళిచేసుకుందామని చెప్పాడు. సూరి మనసు కొద్దిగా ఊరడిల్లింది. కొంతసేపు అతడితో గడిపి ఆస్పత్రికి వచ్చి తన గదికి చేరుకుంది.

ఉండలేక ఒకనాడు మంగమ్మను అడిగింది- "అటువంటి పిల్లలు ఎవరికయినా ఇంతవరకూ పుట్టారా?" అని.

"నేను చూడలేదమ్మా, వినలేదు కూడా" అంది.

సూరి అంతటితో ఆగలేక గుండమ్మ నడిగింది.

గుండమ్మకు చెప్పాలనే ఉంది. అన్యాయాన్ని భరించలేకపోతున్నది-

సూరికి రెండవకాన్పు అయినప్పుడు జమీందారు కారులో రావటం, మగపిల్లవాడని డాక్టరు చెప్పటం, తను ఇంటివెనకనిలబడి చూసింది. డబ్బుదగ్గర కొద్దిగా ఘర్షణ జరగటం కూడా విన్నది. కాని- ఇప్పుడు సూరికిదంతా చెప్పితే పెద్ద తగవయి తన నౌకరీ ఊడిపోతుంది.

బాగా ఆలోచించుకుని "ఇంతకాలంనుంచి ఇక్కడ పనిచేస్తున్నగాని ఎన్నడు చూడకపోతి" అన్నది.

గత్యంతరం లేని సూరి మళ్ళీ లోపలికి వెళ్ళింది. ఎవరూ ఏమీ ప్రశ్నించ లేదు. డాక్టరు వినత చూసీ చూడనట్టూరుకుంది. సూరి పనిచేస్తున్నది, నెలనెలా జీతమందుకుంటున్నది.

ఒకనాడు ఒక మహారాష్ట్ర వనిత, పిల్లలకు ఉదయం స్నానాలు చేయించ టానికి వచ్చిన గుండమ్మతో- "నిన్న మాబాబు పుట్టగానేగుర్తుగా చేతికి నల్లదారం కట్టించాను ఇవాళ ఈ పిల్లను తీసుకువచ్చి ఉయ్యాలలో పడుకోబెట్టారు. నేను చూస్తూనే ఉన్నాను. ఎవరుచేశారీపని?" గద్దించి మాట్లాడింది.

"నేను తీసుకుపోయిన, కాని పండబెట్టింది నేను కాదు" అంది గుండమ్మ.

"ఎవరుచేశారీపని? ఎవరుచేశారీపని?"

ఈ ప్రశ్నలతో హాలంతా దద్దరిల్లిపోయింది.

అందరూ ప్రశ్నిస్తున్నారు కాని జవాబు ఏ ఒక్కరూ చెప్పటంలేదు.

చివరికి సూరి వంతు వచ్చింది. "సూరీ, నీపనా ఇది?" ఎవరో ఆమెను చెయ్యిపట్టి లాగి ప్రశ్నించారు.

ఆస్పత్రికి వచ్చి నలుగురితో మాట్లాడటం అలవాటయిన తరువాత సూరి మాటలలో చాలా మార్పు వచ్చింది. బెరుకుతనం తగ్గింది.

"నేనెన్నడయినా పిల్లలకు నీళ్ళుపోశానా? కడుపుకాలి నేనేడుస్తుంటే నన్న డుగుతరేంటి?" చీదరించుకున్నది సూరి.

జొన్నరొట్టెలు తినే గంగాబాయి అంతటితో వదిలిపెట్టక, గడచినరోజు

పురుడువచ్చిన పచ్చి బాలింత అయినా డాక్టరు వినత కీ సంగతి స్వయముగా ఫిర్యాదు చేసింది.

"మీరిట్లా లేచి తిరగ్గూడదు" అంటూ- "నేను కనుక్కుంటాను వెళ్ళండి మీ రూమ్‌లోకి" అంది కొంచెం కరుకుగా.

ఐదునిమిషాల తర్వాత వచ్చి పనివాళ్ళందరినీ నిలబెట్టి అడిగింది.

"చెప్పండి ఎవరుచేశారీపని? ఇటువంటి పనులు చేసి మా ఆస్పత్రికి చెడ్డ పేరు తీసుకువస్తారా? ఆమె కేకలు మిన్నంటుతున్నాయి.

"చూడండమ్మా గంగాబాయీ, ఈ రూములలో ఉన్న పిల్లలను చూడండి- మీ అబ్బాయి ఉన్నాడేమో?' వినత గంగాబాయిని అన్నిగదులలోకి తీసుకుపోయి ఉయ్యాలల్లో ఉన్న పిల్లలను చూపించింది.

అందరినీ చూసి కాదని తలఊపింది ఆమె.

"నిన్న మీరు సరిగా చూసుకుని ఉండరు. లేకపోతే ఎట్లా మారిపోతాడు మీ అబ్బాయి? రాత్రివేళ- అప్పుడే పురుడు వచ్చింది. మీరు పొరబడి ఉంటారు" డాక్టరు వినత సర్దటానికి ప్రయత్నిస్తోంది.

అంతలోకి నర్సువచ్చి "ఇవాళపొద్దున ఒకామె బిడ్డనెత్తుకుని ఇంటికివెళ్ళింది కాని ఆమెచేతిలో ఆడపిల్లే ఉంది. నేను చూశాను. వెంటనే ఇంకొకామెవచ్చింది. ఆమె ఇంకా కనలేదు.

"ఆమె చేతిలో ఉన్న బిడ్డను నీవు బాగా చూశావా?"

"చూశాను"

"ఈ బిడ్డ గంగాబాయి బిడ్డ కాదంటున్నారు. ఈ బిడ్డ తల్లి ఎక్కడుంది?" డాక్టరు ప్రశ్నించింది.

గంగాబాయి తనబిడ్డ నెవరో స్నానంచేయిస్తానంటూ తీసుకువెళ్ళారనీ తిరిగి ఒక ఆడపిల్లను తీసుకువచ్చి తన గదిలో పడుకోబెట్టారనీ ఆస్పత్రి అదిరిపోయే

టట్టు అరిచి "ఇంక నేనుండనిక్కడ. ఇంటికి వెళ్ళిపోతాను. ఈ బిడ్డ నాకక్కర్లేదు. నాకిదివరకే ఇద్దరాడపిల్లలున్నారు చాలు. నిజంగా నా బిడ్డే అయితే ఏబిడ్డ అయితేనేమని తీసుకుపోతాను. కాని- ఏ తల్లో కన్నబిడ్డ నాకెందుకు?" అంటూ బిల్లుచెల్లించి బండీ తెప్పించుకుని వెళ్ళిపోయింది.

అందరు నివ్వెరపోయారు. గుండమ్మ మెల్లగా తన పని చెయ్యటానికి వెళ్ళిపోయింది. ఈ పని ఎవరు చేసిఉంటారన్న ఆలోచన ఆమెను ఒదిలిపెట్ట లేదు. తను స్నానంచేయించి ఒక్కొక్క బిడ్డనూ మంగమ్మకిచ్చింది, మంగమ్మ నర్సుకిచ్చింది. మరి- బిడ్డను గదిలో పడుకోబెట్టటం గంగాబాయి చూసింది ఈ మార్పిడి ఈ అంచెలలో ఎక్కడ జరిగింది? ఎవరివల్ల?

సరిగ్గా నాలుగేళ్ళకిందటట ఒకసారి ఇట్లాగే జరిగింది. అప్పుడు కూడా ఒక తల్లి ఇలాగే గొడవచేసి వెళ్ళింది. అప్పుడు బిడ్డ చనిపోయిన తల్లికి ఒకమగబిడ్డ నిచ్చి పంపించారు. ఆ మగబిడ్డను కన్నతల్లి గదిలో చనిపోయిన బిడ్డను పడుకో బెట్టారు.

ఇటువంటి పనులు ఎవరివల్ల జరుగుతున్నాయి ?

సూరి ఆరోజున డాక్టరునడిగి తండ్రిని చూడటానికి వెళ్ళింది. వెళ్ళగానే అక్కడి మేనేజరు "మీ నాయన మధ్యాహ్నం చనిపోయాడమ్మా. నీకు ఫోను చేయించాము అందే వచ్చావా ?" అని అడిగాడు. ఆమెను శవాలనుంచే గదిలోకి తీసుకువెళ్ళాడు.

గజగజ వణుకుతూ వెళ్ళిన సూరి శవం ముఖమ్మీద కప్పిన బట్ట తీసి చూసి గొల్లున ఏడ్చింది.

"ఏమయింది మా నాయనకు?" ఏడుస్తూనే అడిగింది.

"అన్నం తిని పడుకున్నాడు. మూడుగంటలకు అందరూ లేచినప్పుడు అతడు లేవలేదు. గుండె ఆగిపోయిందని డాక్టరన్నాడు" అక్కడి నౌకర్లు సూప ర్నెంటు అందరూ అదేమాటన్నారు.

కిందటిసారి తను వచ్చినప్పుడు నవ్వుతూ మాట్లాడాడు. తనకిక్కడ చాలా

బాగుందని సంతోషంతో చెప్పాడు. బాధపడకుండా పోయాదన్నమాట సంతృప్తి నిల్చింది. గాని దుఃఖం కట్టలుతెంచుకుంది సూరికి.

తండ్రి అంత్యక్రియలకు పాతికరూపాయ లిచ్చింది సూరి.

"ఇక్కడ అంత్యక్రియలకు డబ్బు తీసుకోరమ్మా. రూల్సుకు వ్యతిరేకం. అందరికీ జరిగినట్టే జరుగుతుంది" అన్నాడు మేనేజరు.

సూరి ఏడుస్తూ కళ్లు ఒత్తుకుంటూ తను ఎప్పుడూ కోదండాన్ని కలుసుకునే దుకాణం దగ్గర ఆగింది. కోదండం రాగానే దుఃఖం పెల్లుబికింది. అతడు ఆమెను హోటలుకి తీసుకెళ్ళి ఓదారుస్తూ "నీవు ఎట్లా వున్నవ"ని అడిగాడు.

"నాకు నిన్నటినుంచీ వికారపెడుతూఉంది. నన్నేం చెయ్యమంటావు?" కన్నీరు కార్చింది. ఆస్పత్రి సంగతంతా చెప్పింది.

"నా చదువు రెండునెలలలోకి వచ్చింది. పరీక్షకాగానే వెళ్ళిపోదాం. వాళ్ళకు నీ సంగతి తెలియనివ్వకు. ఇక్కడొక డాక్టరున్నాడు. నేను తీసుకువెళ్ళి మంది ప్పిస్తా పద." ఆమెను తీసుకువెళ్ళి డాక్టరుతో చెప్పి మందులు రాయించిఇచ్చాడు.

''ఎవరికీ తెలియకుండా దాచుకుని వేసుకో ఈ మాత్రలు" కొంచెం సేపు బజార్లన్నీ తిప్పి పంపించాడు కోదండం.

సూరి మామూలుగా తిరుగుతూ పనిచేస్తున్నది. అప్పుడప్పుడు సూరి ముఖంలోకి చూస్తూ ఉంటుంది. డాక్టరు "దీన్ని కనిపెట్టి ఉండాలి"అని మనసులో అనుకుంటూ "సూరీ. ఈ మధ్య నీవు ఎవరితోనూ సరిగా మాట్లాడటంలేదు కోపం వచ్చిందా ఎవరిమీదయినా?" అడిగింది.

"నాకు కోపమెందుకు డాక్టరమ్మా?"

"మరి- ఎప్పుడూ ముఖం అట్లా పెట్టుకుంటావేం ?"

"ఏం చెయ్యను తల్లీ. మా నాయన గతించినడు కదా. గుండె ఆగిపోయిం దట."

''అయ్యో, అందుకా అట్లా ఉన్నావు? బాధపడకు, నీవు చెయ్యగలిగినంత

చేశావు.నీ ఆరోగ్యం చెడగొట్టుకోకు. ఏడ్చి ఏంచేస్తావు? అతడికాలమయిపోయింది" అంటూ ఓదార్చింది. సూరి ఆరోగ్యాన్ని గురించి రోజూ అడుగుతుండేది.

కోదండం పరీక్షలయ్యేసరికి సూరికి ఆరోనెల వచ్చింది. కలుసుకున్నప్పుడల్లా "జాగ్రత్తగా నడుచుకో. నీకంతగా భయమయితే నాదగ్గర కొచ్చెయ్యి" అంటూ ఉండేవాడు.

సూరిని బాగా గమనిస్తున్న డాక్టరు దంపతులు సూరిని అనుమానిస్తూనే ఉన్నారు. "ఈసారి దీనికి వికారం, వాంతులూ లేనట్టుగా ఉన్నా"యనుకుంటున్నారు.

సూరి మంగమ్మకుగాని, గుండమ్మకుగాని తన సంగతేమీ చెప్పలేదు. ఆ ప్రసక్తి రానివ్వలేదు. వాళ్ళ గుసగుసలను అంతగా పట్టించుకోలేదు.

ఒకరోజు రాత్రి ఎనిమిది గంటలవేళ ఒక గర్భిణీస్త్రీకి కడుపులోనే చనిపోయిన బిడ్డను ఆపరేషను చేసి బయటికి తీసే ప్రయత్నంలో అందరూ థియేటరు కెదురుగా నిలబడ్డారు. ఆ స్త్రీతో కూడా నలుగురు వచ్చారు.

సూరి ఆ సందడిలో తన బట్టలమూటను చంకనబెట్టుకుని ఇంటివెనక తలుపు తెరుచుకుని బైటికి వెళ్ళిపోయింది. ఆ తెల్లవారుఝామున కోదండంతో రైలెక్కి ఒక నగరం చేరుకున్నది.

మూడు నెలల తరువాత ప్రభుత్వాసుపత్రిలో సూరి పండంటి మగపిల్లవాడిని కన్నది.

మంచిరోజు చూసుకుని తాళిబొట్టు కట్టి పెళ్ళిని రిజిష్టరు చేసుకున్నారు, సూరీ-కోదండం.

మనసులో కోదండం నిజాయితీకి కోటి దణ్ణాలు పెట్టుకుంది సూరి.

తన పిల్లవాడికి తండ్రి ఉన్నాడు. వాడు నిర్భయంగా తండ్రిపేరు చెప్పుకుని బ్రతకవచ్చు. ఎవరిదగ్గరా తల వొంచుకోవలసిన అవసరం లేదు. అనుకుని మురిసిపోతోంది.

ఆ బిడ్డలు కూడా ఈ బిడ్డలాగే పుట్టే ఉంటారు. డాక్టర్లు తనను మోసం

చేయకపోతే తనకు ముగ్గురు బిడ్డలుండేవారని దోసెట్లో చెయ్యి పెట్టుకుని కుంగిపోతుంది జ్ఞాపకం వచ్చినప్పుడు సూరి.

అటువంటి సందర్భాలలో "యేయ్ సూరి, మళ్ళీ మళ్ళీ గతంలోకి జారుకోకు. వాడే ముగ్గురనుకో. వాడే త్రిమూర్తి." అంటూ ఆమె ముఖాన్ని పైకెత్తుతాడు మురిపెంగా కోదండం.